# తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

**• ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్**

ఎర్రగడ్డ, అక్టోబర్ 7: మతాలకు అతీతంగా అన్ని పండుగలకు ప్రాధాన్యత ఇస్తున్న సీఎం కేసీఆర్ అందరి బంధువుగా పేరు తెచ్చుకున్నారని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. బోరబండ బస్ టెర్మినల్ చౌరస్తా వద్ద నిర్వహించిన కార్యక్రమంలో డివిజన్ మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిని చాటే బతుకమ్మ సంబురాల్లో మతాలకతీతంగా పాలు పంచుకోవటం ప్రత్యేకతగా అభివర్ణించారు. సుపరిపాలన, శాంతి భద్రతల పరిరక్షణ, జెట్ స్పీడులో అభివృద్ధి, పేదలకు సంక్షేమ పథకాలు.. ఇవన్నీ బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రత్యేకతలు అని



మహిళలకు బతుకమ్మ చీరలను అందజేస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్



పైప్‌లైన్ పనులను శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

పేర్కొన్నారు. ఇతర ఏ రాష్ట్రంలో లేని విధంగా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా ముందుకు వెళ్తున్నారన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణమోహన్, విజయకుమార్, కోఆర్డినేటర్ విజయసింహ, ఇన్‌చార్జి సిరాజ్, లక్ష్మణ్‌గౌడ్,దేవమణి, గోగుళ్ల వెంకటేశ్, వినాయకరావునగర్ అధ్యక్షుడు ఆనంద్, సీహెచ్ కవిత, లడ్డు తదితరులు పాల్గొన్నారు.

**షేక్‌పేట్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

షేక్‌పేట్ అక్టోబర్ 7:సీఎం కేసీఆర్ నేతృత్వంలో ప్రజలకు అభివృద్ధిని అందిస్తున్నామని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. శనివారం షేక్‌పేట్ డివిజన్‌లో రూ. 1 కోటి 5 లక్షల నిధులతో హకీంషా, విరాట్‌నగర్, డైమండ్‌హిల్స్,షేక్‌పేట్ గ్రామం, వివేకానందనగర్‌లలో నిర్మించనున్న సీవరేజీ, తాగునీటి పైప్‌లైన్‌ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్, ప్రధాన కార్యదర్శి షకీల్, గౌరీశంకర్, సజ్జాద్, అకీల్, అక్బర్, ఎల్లేశ్, రాము, శ్రీనివాస్, రమేశ్, వీరేశ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారంపై అవగాహన



పోషకాహార వారోత్సవాల్లో భాగంగా శ్రీరాంనగర్‌లోని జాస్మిన్ స్కూల్‌లో న్యూట్రిషన్ డేను నిర్వహించారు. పోషకాహార పదార్థాల ప్రదర్శన నిర్వహించడంతో పాటు చిన్నారులు పండ్లు, కూరగాయల వేషధారణలో అలరించారు. పాఠశాల చైర్మన్ పి.జగన్నాథం ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. –జూబ్లీహిల్స్,అక్టోబర్7

## సీజనల్ పండ్లు తినాలి



భోలక్‌పూర్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో శనివారం 'ఫ్రూట్స్ అండ్ వెజిటేబుల్స్ డే' నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రైమరీ విద్యార్థులు పండ్లు, కూరగాయలుగా అలంకరణ చేసి రావడం అందరిని ఆకట్టుకున్నది. బయట దొరికే జంక్ ఫుడ్ తినకూడని, ప్రకృతి సిద్ధంగా లభించే సీజనల్ పండ్లు తినాలని, వాటిలో ఉండే పోషక విలువల వలన అందరికీ ఆరోగ్యం లభిస్తుందని పాఠశాల కరెస్పాండెంట్ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. –బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 7

## అత్త పై కోడలు దాడి

వెంగళరావునగర్, అక్టోబర్ 7: పుట్టింటి వారితో కలిసి అత్త పై దాడికి పాల్పడింది ఓ కోడలు. భర్తకు చాడీలు చెపుతూ తన కాపురాన్ని కూలదోయాలని అత్త ప్రయత్నిస్తుందన్న నెపంతో దాడికి దిగారు. కోడలితో పాటు ఆమె పుట్టింటి వారి చేతుల్లో గాయపడ్డ బాధితురాలైన ఆ అత్త శనివారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై ఉదయ్ తెలిపిన వివరాల ప్రకారం..మధురానగర్ కాలనీకి చెందిన గీతాప్రభ సెప్టెంబర్ 12వ తేదీ సాయంత్రం ఇంట్లో ఉండగా ఆమె కోడలు గాయత్రి, ఆమె సోదరి శ్రీదేవి, తల్లిదండ్రులు మంజుల, జగన్మోహన్ రావు ఇంట్లోకి ప్రవేశించారు. కుటుంబ కలహాల విషయమై చర్చించుకుందామని చెప్పి వచ్చిన వారంతా ఇంట్లోని సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. అత్త గీతాప్రభ పై కోడలు పిడిగుద్దులతో కొట్టింది. దీంతో తన ప్రాణానికి ముప్పు ఉందని భావించిన గీతాప్రభ తన కూతురు ఇంటికి వెళ్లిపోయింది. ఈ దాడిలో శరీరం లోపలి అవయవాలు దెబ్బతిన్నాయని..తన పై దాడి చేసిన వారి పై చర్యలు తీసుకోవాలను కోరుతూ బాధితురాలు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కోడలుతో పాటు వారి పుట్టింటి వారి పై సెక్షన్ 427,506 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# ఓటరు జాబితా సిద్ధం చేయాలి

జూబ్లీహిల్స్,అక్టోబర్7: నగరంలో ఉపాధి పనుల కోసం, ఉద్యోగాల కోసం ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతాలకు మారుతున్న మైగ్రేషన్ ఓట్లపై దృష్టి పెట్టాలని జిల్లా ఎన్నికల సంఘం అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ ఎన్నికల అధికారులను ఆదేశించారు.అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఓటరు జాబితా ప్రక్షాళనకు జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు పారదర్శక ఓటరు జాబితా సిద్ధం చేయాల్సిందిగా జిల్లా ఎన్నికల సంఘం అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ ఎన్నికల అధికారులను ఆదేశించారు. శనివారం యూసుఫ్‌గూడ సవేరా ఫంక్షన్ హాల్‌లో బీఎల్ఓ సూపర్‌వైజర్‌లతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని ఎన్నికల సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. రెండు రోజుల క్రితం ఎన్నికల సంఘం ప్రకటించిన తుది ఓటరు జాబితాలో హైదరాబాద్ జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాలలో జూబ్లీహిల్స్‌లో అత్యధికంగా 3,75,452 మంది ఓటర్లు నమోదయ్యారు. దీంతో ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఉండేందుకు రివిజన్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా చనిపోయిన వారి ఓట్లు, నియోజకవర్గంలోనే రెండుసార్లు నమోదైన ఓట్లతో పాటు నకిలీలపై నిఘా పెట్టాలని కమిషనర్ రొనాల్డ్ రాస్ ఎన్నికల సిబ్బందికి సూచించారు. పక్కా ఓటరు జాబితా ప్రకటించేందుకు ఎన్నికల సిబ్బంది యుద్ధప్రాతిపదికన సరవణల ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించారు. జూబ్లీహిల్స్ రిటర్నింగ్ ఆఫీసర్, సికింద్రాబాద్ ఆర్డీఓ రవి, ఏఈఆర్ఓలు ఏసీపీ రాణి, ఏఎంసీ కమల్, తహసీల్దార్ నయామొద్దీన్ పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్

## జూబీహిల్స్‌లో అత్యధికంగా ఓటర్లు

జూబ్లీహిల్స్,అక్టోబర్7: హైదరాబాద్ జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాలలో జూబ్లీహిల్స్‌లోనే అత్యధికంగా 3,75,452 మంది ఓటర్లు నమోదయ్యారు. ఇప్పటివరకు జిల్లాలో 3,56,995 మంది ఓటర్లున్న జూబ్లీహిల్స్ నియోజకవర్గం మరో 18,435 మంది ఓటర్లు పెరగడంతో మళ్లీ అత్యధిక ఓటర్లతో అగ్రస్థానంలో నిలిచింది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 329 పోలింగ్ బూత్‌లు ఉండగా 1,98,204 మంది పురుషులు, 1,77,207 మంది మహిళలు, 19 మంది థర్డ్ జెండర్ ఓటర్లు నమోదయ్యారు. గతంలో 1,88,989 మంది పురుషులు, 1,67,988 మంది మహిళలు, 18 మంది థర్డ్ జెండర్ ఓటర్లుండగా ఎన్నికల సంఘం అధికారులు తాజాగా ప్రకటించిన ఓటరు జాబితాలో సుమారు 5 శాతం ఓటర్లు పెరిగారు.

## మహిళ అదృశ్యం



స్వరూప(ఫైల్)

ఎర్రగడ్డ, అక్టోబర్ 7: పని మీద ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైంది. ఇన్‌స్పెక్టర్ కామల్ల రవి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రగడ్డ సుల్తాన్‌నగర్‌లో ఉంటున్న రమేశ్, స్వరూప దంపతులకు ఇద్దరు పిల్లలు. రెండు వారాల క్రితం ఏదో పని మీద బయటకు వెళ్లిన స్వరూప తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికినా ఫలితం లభించలేదు. ఈ విషయమై స్వరూప తల్లి యాదమ్మ బోరబండ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని ఏఎస్సై తిరుమలయ్య దర్యాప్తు చేస్తున్నారని.. ఎవరికైనా స్వరూప ఆచూకీ లభిస్తే బోరబండ పీఎస్ నంబర్‌కు 8712665189 కు సమాచారం అందించాలని సీఐ కోరారు.

## చెట్ల కొమ్మలు తొలగింపు

ఎర్రగడ్డ, అక్టోబర్ 7: బోరబండ డివిజన్‌లో పెద్ద బస్తీ అయిన రాజ్‌నగర్‌లోని పలు వీధుల్లో విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తాకుతుండటంతో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సూచన మేరకు సంబంధిత శాఖ సిబ్బంది శనివారం రంగంలోకి దిగి వైర్లను తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగించారు. రాజ్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జైభీమ్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి సుధాకర్, జంయుక్త కార్యదర్శి శ్రీకాంత్‌రావు, యూత్ ప్రెసిడెంట్ భాస్కర్‌యాదవ్ తదితరులు సిబ్బందికి సహకరించారు.

## సత్యసాయి నిగమాగమంలో వస్త్ర ప్రదర్శన ప్రారంభం

వెంగళరావునగర్, అక్టోబర్ 7:శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఏర్పాటు చేసిన జాతీయ పట్టు వస్త్ర ప్రదర్శనను వర్ధమాన నటి నిహాసిని వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ స్టాల్స్‌లో కొలువుదీరిన చేనేత వస్త్రాలు పరిశీలించిన అనంతరం వర్ధమాన నటి నిహాసిని వర్మ మాట్లాడుతూ ఇక్కడ వస్త్రాలు భారతీయ సంప్రదాయం ప్రతిబింబించే విధంగా ఎంతో అందంగా ఉన్నాయని పేర్కొన్నారు. దేశ నలుమూలలకు చెందిన ప్రత్యేక కలెక్షన్స్ మగువల మనస్సు దోచేలా ఒకే వేదిక పై అందుబాటులోకి తేవడం అభినందనీయమని అన్నారు. నిర్వాహకుడు జయేశ్ గుప్తా మాట్లాడుతూ..దేశంలోని 14 రాష్ట్రాల్లో పేరుగాంచిన వివిధ రకాల, చేనేత కారులు, చేతి పని బృందాలు తమ సిల్క్ చీరలు, హ్యాండ్ లూమ్ డ్రెస్ మెటీరియల్ వంటి 75 వేల రకాల ఉత్పత్తులను అందుబాటులో ఉంచామని, ఈ నెల 15వ తేదీ వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందని తెలిపారు.



చీరలను ప్రదర్శిస్తున్న వర్ధమాన నటి నిహాసిని వర్మ

## ముదిరాజ్ సభను విజయవంతం చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 7: ముదిరాజ్ ఆత్మగౌరవ సభకు ప్రతిఒక్కరూ తరలిరావాలని ముదిరాజ్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మీగారి ఆంజనేయులు పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం ఈ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ సభకు పిలిస్తే కాదు తెలిస్తే రావాలని అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రతి ముదిరాజ్ బిడ్డ సభకు హాజరుకావాలని కోరారు. విద్యార్థి నాయకులు భీమ్‌సేన్ ముదిరాజ్, స్వామి ముదిరాజ్, జగదీశ్ ముదిరాజ్, వెంకటేశ్, జానకీరామ్, స్వామి, బోయిన ప్రదీప్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

